ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

- పోటాపోటీగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు
- ఈదురు గాలులకు పడిపోతున్న ఫ్లెక్సీలు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల : మండల కేంద్రంలో ఏదైనా అధికార, అనధికార కార్యక్రమాలు చేస్తున్నారంటే మండల కేంద్రం మొత్తం ఫ్లెక్సీలతో నిండిపోవాల్సిందే. అందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీలకు కొదవలేదు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే వాటిని వీలైనంత వరకు తగ్గించాలని ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేస్తున్నా నాయకులు మాత్రం అవేవి పట్టించుకోకుండా ఇష్టారీతిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన నాయకుల మన్ననలను పొందేందుకు మండల నాయకులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

ప్రమాదం సంభవిస్తేనే స్పందిస్తారా ?

కొన్ని రోజులుగా ఈదురు గాలులతో భారీ వర్షాలు సైతం కురియడంతో మండల కేంద్రంలో ఏ సమయంలో ఏ ఫ్లెక్సీ ఎటు పడిపోతుందో, ఎవరిపై పడితుందోనని మండల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో రెండు రోజుల క్రితం ఈదురు గాలులకు భారీ ఫ్లెక్సీలు ఓ కారుపై పడేలోపు తప్పించుకున్నాడు. అలాగే మరో ఫ్లెక్సీ పాదచారుడిపై పడిపోగా స్థానికులు కాపాడారు. ఇలా కొన్ని ఫ్లెక్సీలు చిరిగిపోయినా తొలగించక పోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి.



అంకుషాపూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



టేకుమట్ల బస్‌షెల్టర్ ఆవరణలో..

ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అధికార, ప్రతిపక్ష నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గి ఏం చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నారు. కానీ ఫ్లెక్సీలతో ప్రమాదాలు సంభవిస్తేనే స్పందిస్తారా అంటూ అధికారుల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫ్లెక్సీలను తొలగించి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫ్లెక్సీలను తొలగిస్తాం



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తాం. అలాగే ప్రమాదకరంగా ఉండకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని ఆదేశాలను సైతం జారీ చేస్తా. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి. ప్రమాదాలకు అవకాశం లేకుండా ఫ్లెక్సీల ఏర్పాటు చేస్తే బాగుంటది.

– అనిత, ఎంపీడీఓ

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ : పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అండగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రం, శ్వేత, డిప్యూటీ తహసీల్దార్ రజాక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పున్నం రవి, మేకల భిక్షపతి, బొజ్జం రవి, నాసాని రాంబాబు, విజేందర్, వెంకటస్వామి, పన్నాటి శ్రీను, వీరబ్రహ్మం, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

రైతులకు న్యాయం చేయాలి

- గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితుల ఆందోళన
- ట్రెంచింగ్ పనుల అడ్డగింత

టేకుమట్ల : గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పనులను అడ్డుకుంటామని రైతులు అన్నారు. శుక్రవారం మండలంలోని రామకిష్టాపూర్(టి) శివారులో గ్రీన్‌ఫీల్డ్ హైవే ట్రెంచింగ్ కోసం వచ్చిన తహసీల్దార్ విజయలక్ష్మిపై రైతులు తిరగబడ్డారు. రెండో విడత డబ్బులు జమ చేస్తారని నచ్చజెప్పినా వినకుండా పనులను అడ్డుకున్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఇప్పటి వరకు మొదటి విడత డబ్బులు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, రెండో విడత జమ చేయకుండానే రైతుల భూముల్లోకి వచ్చి పనులు చేసుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు కొంత మంది రైతుల పంటలు పొలాల్లోనే ఉన్నాయని, అధికారులు దౌర్జన్యంగా పంటలను ధ్వంసం చేస్తే వాహనాలను అడ్డుకోక తప్పదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సహకరించిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని, అందుకు అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు కొడగాని నవీన్, కిష్టారావు, కొత్తపల్లి సంపత్, సల్వాల కుమార్, గంధం బాలకొమురు, రాజేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న రైతులు

కుప్తంగా

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



చిట్యాల : దేశవ్యాప్తంగా కులగణన చేయడం చరిత్రాత్మక నిర్ణయం అని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి వర్గంలో దేశవ్యాప్త కులగణన చేపట్టడం కోసం నిర్ణయం తీసుకోవడంపై హర్షించదగ్గ విషయం అని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు తీగల జగ్గయ్య, మాచర్ల రఘు, చెక్క నర్సయ్య, గుండ సురేష్, గజనాల రవీందర్, ఓదెల శ్రీహరి. శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



చిట్యాల: మండలంలోని కొత్తపేటలో తొర్రె రాములుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందింది. రైతు కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే గేదె మేతకు వెళ్లిందని, మేత మేస్తున్న సమయంతో విద్యుత్ స్తంభం వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా గేదె విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని తెలిపాడు.

పిడుగుపాటుకు ఎద్దు..



మల్హర్ : మండలంలోని నాచారంలో గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షం కారణంగా గ్రామంలో పిడుగు పడింది. గ్రామానికి చెందిన కన్నూరి అశోక్‌కు చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 35వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

సన్మానం



చిట్యాల : నూతనంగా డీపీఓగా విధుల్లో చేరిన వీరభద్రయ్యను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీ ఖాజా, తొలుకునూరి అశోక్, రాజేందర్, ప్రదీప్, బానాల కుమార్, స్వామి, దేవేందర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారం అందించాలి

భూపాలపల్లి అర్బన్ : జిల్లాలో గాలివానకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో రెండు రోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలు కురిసినట్లు తెలిపారు. చేతికి వచ్చిన మామిడి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. పలుగ్రామాల్లో ఇళ్లు ధ్వంసమైనట్లు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం నష్టంపై అంచనా వేసి, పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

కాళేశ్వరం : వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల అధ్యక్షుడు కుమ్మరి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. వ్యవసాయ అధికారులకు ఎర్రచెరువు వద్ద వరదలో కొట్టుకుపోయిన ధాన్యానికి పరిహారం అందజేయాలని వినతిపత్రం అందజేశారు.

కూలిన ఇంటి గోడ



వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో గాలికి ఇంటి గోడ కూలింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఉరుములు, మెరుపులతో గాలి వీచింది. ఆ సమయంలో చిరు జల్లులు సైతం పడ్డాయి. గాలి ఉధృతంగా రావడంతో మొడెం సురేష్ ఇంటికి చెందిన సిమెంట్ ఇటుకల గోడ కూలి పోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

దిగబడిన బొలెరో వాహనం

- ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్డు

పలిమెల : వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి బస్తాల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని లెంకలగడ్డ సమీపంలోని బండలవాగు వద్ద నడిరోడ్డుపై దిగబడింది. ఎంత ప్రయత్నించినా కదలక పోవడంతో మూడు ట్రాక్టర్ల సాయంతో వాహనాన్ని తీసినట్లు రైతులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజు మాత్రమే వరంగల్ వ్యవసాయ మార్కెటు ఉండడంతో సమయానికి బస్తాలు చేరుకోవాలని, బస్తాలు చేరుకునే లోపు మార్కెట్ సమయం దాటుతోందని వాపోయారు. మూడు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు ఉండటంతో శుక్రవారం రోజునే మార్కెట్‌కు చేరాలని లేకుంటే వెయిటింగ్ చార్జీలు అదనంగా పడుతాయని వాపోయారు. గత ఏడాది పంకెన వద్ద ఇసుక క్వారీ నడవడంతో మండలంలోని లెంకలగడ్డ వద్ద రోడ్డు ధ్వంసమైంది. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డును మళ్లీ నిర్మించకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని రైతుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ధ్వంసమైన చోట రోడ్డు వేయాలని కోరారు.



దిగబడిన బొలెరో వాహనాన్ని ట్రాక్టర్ల సాయంతో బయటికి తీస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య పనులు



వాజేడు: మండల కేంద్రంలోని నాగారం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ముందుగా తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎంపీఓ ఆదేశించారు. గ్రామాల్లోని మురుగు నీటి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తీయించారు. రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారుల పరుగులు

కాళేశ్వరం : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఎంపీడీఓ ఆఫీసులో సంబంధిత పత్రాలు ఇవ్వనివారితో పాటు మిస్సయిన పత్రాల కోసం సంబంధిత అధికారులు ఫోన్లు చేసి తెప్పించుకుంటున్నారు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, డ్రైవింగ్ లైసెన్సు, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తేవాల్సిందిగా చెబుతున్నారు. ఇందులో ఏ ఒక్కటి లేకపోయిన తప్పనిసరిగా తీసుకు రావల్సిందేనని.. లేదంటే మీ అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని చెబుతుండటంతో కార్యాలయానికి పరుగులు తీయాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. దరఖాస్తు సమయంలో కార్యాలయంలో ఆన్లైన్ దరఖాస్తు ఫారంతో పాటు కావాల్సిన డాక్యుమెంట్లు అప్పుడే అడిగితే సరిపోయేదని.. మళ్లీ ప్రత్యేకంగా తెచ్చి ఇవ్వాలంటూ ఫోన్ చేయడమేంటని పలువురు వాపోతున్నారు. క్రిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యంతోనే దరఖాస్తుదారులు పరుగులు పెట్టాల్సి వస్తోందని మండిపడుతున్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా దరఖాస్తు చేసుకుని కాపీలు ఇవ్వనివారికే ఫోన్ చేసి తెప్పించుకుంటున్నామన్నారు. డాక్యుమెంట్లు ఇవ్వనివారు ఇవ్వాలని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెనుగోలు కాలనీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

- హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ

వాజేడు: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్ఈఓ వేణుగోపాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పెద్ద గంగారం గ్రామంలో పేరూరు వైద్య సిబ్బంది శుక్రవారం సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల రావు ఆదేశాల మేరకు ఈ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని ప్రతికూల పరిస్థితులు, జీవన విధానంలో వచ్చిన మార్పుల వలన సికిల్ సెల్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, సుమలత, ఆశ కార్యకర్త ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడుతో కలిసి ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిల్వ నీటిని పారబోయడంతో పాటు పలు సూచనలను సలహాలను ఇచ్చారు. అనంతరం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వెంకట రమణ, కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, శాంత కుమారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలు పాటించాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు కృష్ణబాబు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పేడు వీరాపురం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఇసుక ర్యాంపుల్లో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ టిప్పర్లు, పొక్లెయినర్ సహాయంతో ఇసుక తరలిస్తున్నారని అన్నారు. ఇసుక దోపిడి పలువురి రెవెన్యూ అధికారుల అండదండతోనే సాగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కంతి రవీంద్ర, తుర్స శంకర్, బొగ్గుల ప్రశాంత్, పూనెం రవీంద్ర, నర్సింహులు, నవదీప్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతులు అధైర్య పడొద్దు

- పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: రైతులు అధైర్య పడొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. చల్వాయి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం నీళ్ల పాలు అవుతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మిల్లర్లు పలు కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని, లారీలు కూడా సరిగా రాక ఇబ్బందులు పడుతున్నామని ఎస్సైతో రైతులు వాపోయారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. బస్తాలను మిల్లుకు తరలించడానికి లారీలను తెప్పించే బాధ్యత నాదే అని భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రానికి సరిపోను బార్దాన్ కూడా వచ్చేలా చొరవ చూపిస్తానని తెలిపారు. భారీ వర్షంతో ధాన్యం నేలపాలై నష్టపోయిన రైతులకు మనోధైర్యాన్ని కల్పించాడు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

గోవిందరావుపేట: యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో శుక్రవారం యువతకు పస్రా ఎస్సై కమలాకర్ వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా క్రీడలను ఎంచుకోని ముందుకు సాగాలని అన్నారు. గ్రామంలోని యువతను క్రీడలపై ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

మల్హర్ : మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. భారీ వర్షం కారణంగా రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, కొయ్యూరు తదితర గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం కొట్టుక పోయింది. అలాగే ధాన్యం కుప్పల మీద టార్పాలిన్లు కప్పినా వర్షం ఎక్కువగా కురవడంతో వరదనీరు కుప్పల కిందికి చేరింది. కొన్ని ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లోనే నేలకొరిగి, వడ్లు రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నీళ్ల పాలవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికం కాకముందే అధికారులు ధాన్యం సేకరణ పనులు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

రేగొండ : మండలంలోని రామన్నగూడెంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన మోతే రాజిరెడ్డికి చెందిన రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట నేలవాలింది. పంట చేతికొచ్చే తరుణంలోనే మాయదారి వర్షం నట్టేటా ముంచిందని రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. పసుల అనిల్, గొల్లపల్లి మల్లయ్యకు చెందిన ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.



రేగొండ: నేలవాలిన మొక్కజొన్న చేను

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ర్యాలీ

వాజేడు: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని సతపాకల నుంచి ఎంపీడీఓ కార్యాలయ వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల కోసం సర్వే చేసిన లిస్టును పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులు సూచించిన అభ్యర్థుల పేర్లు లిస్టులో పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓ విజయ మాట్లాడుతూ అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, పుకార్లు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జెజ్జరి దామోదర్, బచ్చలి కృష్ణ బాబు, గుగ్గిళ్ల దేవయ్య, సౌమ్య, సంతోష్, ముత్తయ్య, రమాదేవి, శాంతకుమారి, లింగయ్య, కృష్ణ బాబు తదితరులున్నారు.

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం



ఏటూరునాగారం : ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు పైడాకుల మల్లేశ్ తెలిపారు. కులగణన నిర్వహణపై కేంద్రం ప్రకటన చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజ్‌కుమార్, సురేష్, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ఏటూరునాగారం: కులగణనతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్ల బచ్చయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంపత్, ఎర్రల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ



మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, రోహీర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఆయా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థలకు ఎవరు బానిస కావొద్దన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.